AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

26-9-2026 (Saturday) MAIN EDITION

ఖైరతాబాద్ ఉపఎన్నికలో పోటీ చేస్తాం : కవిత



అక్షరటుడే, హైదరాబాద్ : ఖైరతాబాద్ ఉప ఎన్నికల బరిలో తమ పార్టీ అభ్యర్థిని నిలబెడుతున్నట్లు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయించిన ప్రజాప్రతినిధులకు, వారిని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఉప ఎన్నికల ద్వారా ప్రజలతో తగిన బుద్ధి చెప్పిస్తామని స్పష్టం చేశారు.

వారంలో ఇద్దరు పేషెంట్ల మృతి.. నర్సింగ్ హోమ్ సీజ్



అక్షరటుడే, ఏపీ : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎంవీఎస్ నర్సింగ్ హోమ్‌లో వారం రోజుల్లో ఇద్దరు రోగులు చనిపోయారు. దీంతో వైద్యారోగ్య శాఖ అధికారులు దానిని సీజ్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి ట్రీట్‌మెంట్ చేయొద్దని స్పష్టం చేశారు. ఎంవీఎస్ సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్‌లో తాజాగా దీప్తి అనే మహిళ చనిపోయింది. డెంటిస్టుగా పని చేస్తున్న ఆమె డెలివరీ అనంతరం మృతి చెందింది. వారం క్రితం ఇదే ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి కుమారి అనే మహిళ చనిపోయింది. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు.

తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ ఇన్ సర్వీస్ టీచర్స్ టెట్ ఫలితాలు శనివారం విడుదల అయ్యాయి. టీచర్స్ టెట్లో 70.07 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 15,749 మంది ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించారు. ఏడాదికి రెండు సార్లు ఇన్‌సర్వీస్ టెట్ నిర్వహించనున్నారు. మళ్లీ అక్టోబర్ 1న నోటిఫికేషన్ రానుంది.

పైలట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం



అక్షరటుడే, ఏపీ: కర్నూలు ఎయిర్ పోర్టులో పైలట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దీనిని ప్రారంభించారు. రాష్ట్రంలోనే తొలి పైలట్ శిక్షణ కేంద్రం కర్నూలు ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేశామన్నారు. మంత్రులు బీసీ జనార్ధన్, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.

స్కై స్ట్రైకర్ పరీక్ష విజయవంతం



అక్షరటుడే, ఢిల్లీ : భారత అమ్ముల పాదిలో మరో అస్త్రం చేరనుంది. స్కై స్ట్రైకర్ డ్రోన్ పరీక్షను అధికారులు విజయవంతంగా నిర్వహించారు. యుద్ధ అభ్యాస్ 2026 విన్యాసాల సందర్భంగా మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద స్కై స్ట్రైకర్ లోయిటరింగ్ మ్యూనిషన్ పరీక్ష నిర్వహించగా.. విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించింది.

ఆసియా క్రీడల్లో భారత్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. పతకాల పంట పండిస్తున్నారు. శనివారం రెండు స్వర్ణాలు, రెండు రజతాలు సహా 5 పతకాలు సాధించారు. కబడ్డీలో మహిళలు, పురుషుల జట్లు ఇరాన్‌ను మట్టి కరిపించి పసిడి పతకాలను అందుకున్నాయి. షూటింగ్, మారథాన్‌లో భారత ప్లేయర్లు రజత పతకాల గెలుచుకున్నారు.

- అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్



భారత్ పసిడి పట్టు..

■ గోల్డ్ మెడల్ సాధించిన మహిళల, పురుషుల కబడ్డీ జట్లు ■ మారథాన్, షూటింగ్‌లో రజత పతకాలు

ఆసియా క్రీడల్లో భారత మహిళల కబడ్డీ జట్టు సత్తాచాటింది. ఫైనల్‌లో ఇరాన్‌ను మట్టి కరిపించిన భారత అమ్మాయిలు బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఇరాన్‌ను 37-34 తేడాతో భారత్ ఓడించింది. టోకాయ్ సిటిజన్ జిమ్నాసియంలో ఉత్కంఠగా సాగిన ఫైనల్‌లో భారత్ గెలుపొందింది. భారత మహిళల కబడ్డీ జట్టు తన ఆసియా క్రీడల టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ఆసియా క్రీడల్లో కబడ్డీ విభాగంలో భారత్‌కు ఇది మూడో స్వర్ణం కావడం గమనార్హం. 2018 జకార్తా క్రీడల్లో ఇరాన్ చేతిలో ఓడిన భారత మహిళలు రజతంతో సరిపెట్టుకున్నారు. తాజాగా స్వర్ణం గెలిచి ప్రతీకారం తీర్చుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రతి ఆసియా క్రీడల్లో ఒక్కసారి మినహా అన్నింట్లో భారత్ బంగారు పతకం సాధించింది.

పురుషుల జట్టు సైతం..

ఆసియా గేమ్స్‌లో ఇరాన్‌తో శనివారం మధ్యాహ్నం జరిగిన ఉత్కంఠ పోరులో భారత పురుషుల జట్టు ఘన విజయం సాధించింది. ఆది నుంచి ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఫస్ట్ హాఫ్ ముగిసే సమయానికి భారత్‌పై ఇరాన్ 18-17తో ఆధిక్యంలో నిలిచింది. విరామం అనంతరం భారత్ పుంజుకుంది. ఇరాన్‌ను ఆలౌట్ చేయడంతో మూడు బోనస్ పాయింట్లు సాధించి 29-24 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అనంతరం ఇరాన్‌ను 40-34 తేడాతో ఓడించి నాలుగో స్వర్ణ పతకాన్ని అందించడంతో పాటు తమ టైటిల్‌ను నిలబెట్టుకుంది.

మారథాన్‌లో..

పురుషుల మారథాన్ ఫైనల్‌లో సావన్ బర్వాల్ 2:11:37 సమయంతో తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేసి, సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ విభాగంలో భారత్ 44 ఏళ్ల తర్వాత పతకం సాధించడం గమనార్హం. షూటింగ్‌లో మహిళల 50మీ రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో తిలోత్తమ సేన్, విదర్భ వినోద్, ఆషి చౌక్సే రజతం గెలుచుకున్నారు. జోష్నా చినప్ప, వేలవన్ సెంథిల్‌కుమార్‌ల జోడీ మిక్స్‌డ్ డబుల్స్ స్క్వాష్ ఈవెంట్ నుండి కాంస్య పతకంతో నిష్క్రమించింది.

పాక్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రసంగంలోని వ్యాఖ్యలకు భారత్ శనివారం కౌంటర్ ఇచ్చింది. దౌత్యవేత్త పెటల్ గెహ్లోట్ షరీఫ్ వ్యాఖ్యలను "విచిత్రంగా" అభివర్ణించారు. పాక్ ప్రధాని షరీఫ్ శుక్రవారం ఐరాస సమావేశంలో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై భారత్ స్పందిస్తూ.. పాక్ పగటిపూట భద్రతను కాపాడుతున్నామని చెప్పుకుంటూ, రాత్రిపూట ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని విమర్శించింది. ఉగ్రవాదానికి పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పాకిస్థాన్‌ను భారత్ హెచ్చరించింది.

చాకలి ఐలమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం: కేసీఆర్



అక్షరటుడే, సిద్దిపేట: తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ సోయికి నిలువెత్తు ప్రతీక చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొనియాడారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె చేసిన త్యాగాలను స్మరిస్తూ ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగించడం ద్వారానే ఆమెకు నిజమైన నివాళి అర్పించినవాళ్లమౌతామని తెలిపారు. రాచరిక పాలనలో తెలంగాణ రైతాంగం కోసం ధీర వనిత ఐలమ్మ ధిక్కార స్వరం వినిపించారని, అణచివేతకు గురవుతున్న వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కేసీఆర్ పేర్కొన్నారు.


ఈసీ తీరుపై మంత్రి ఉత్తమ్ ఫైర్



అక్షరటుడే, హైదరాబాద్ : ఓటరు జాబితా సవరణలో వెలుగు చూసిన అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో 'రిఫరీ'పైనే అనుమానం కలిగితే అది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం స్వతంత్రతే ప్రధాన పునాది అని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఎన్నికల్లో రగులుతున్న రాజకీయం..

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల నగారా మోగడంతో డిపోల వద్ద రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విచిత్ర వైఖరి స్వపక్షంతో పాటు కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి నమ్మినబంటుగా ఉన్న అనుబంధ కార్మిక సంఘం ఐఎన్టీయూసీని పక్కనబెట్టి, ఎలాంటి అధికారిక పార్టీ అఫిలియేషన్ లేని 'తెలంగాణ వర్కర్స్ యూనియన్' (టీడబ్ల్యూయూ)కి మద్దతు ప్రకటిస్తూ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ లేఖ విడుదల చేయడం పెద్ద వివాదానికి దారితీసింది.




కల్తీ మద్యం తాగి 19 మంది మృతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: కల్తీ మద్యం తాగి 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటన నాగాలాండ్‌లో చోటు చేసుకుంది. రాష్ట్రంలో 1990 నుంచి మద్యపాన నిషేధం అమలులో ఉంది. అయినా కూడా కొందరు గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. కొందరు కల్తీ మద్యం సైతం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా కల్తీ లిక్కర్ తాగి 19 మంది చనిపోయారు. అక్రమ మద్యం సేవించిన తర్వాత రెండు రోజుల్లో మోకోక్‌చుంగ్ జిల్లాలో ఎనిమిది మంది, టుయెన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మరణించారని పోలీసులు తెలిపారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే ప్రాధాన్యం

అక్షరటుడే, జనగామ: రాష్ట్రంలో పూరిగుడిసె ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. జనగామ నియోజకవర్గంలో ఉన్న సుమారు 500 గుడిసెల్లో ఉంటున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు.





గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో 13 మంది మృతి

అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగిన గణేష్ నిమజ్జనోత్సవాలు కొన్నిచోట్ల తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. పండుగ సందర్భంగా జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ చేదు వార్తను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్వయంగా వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయమేమిటంటే.. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో విధి నిర్వహణలో ఉన్న ఓ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (SI) కూడా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.24 లక్షల వినాయక విగ్రహాలను మండపాల్లో ప్రతిష్టించారు. ఇళ్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో కలుపుకుంటే, రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు.

ఘోర విమాన ప్రమాదం..

అక్షరటుడే, నేషనల్ డెస్క్: సెంట్రల్ ఆఫ్రికాలోని కాంగో దేశంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. విమానం కూలిపోయి 14 మంది చనిపోయారు. కిక్విట్ నుంచి కాంగో రాజధాని కిన్షాసాకు వెళ్తుండగా.. కెంగే ప్రాంతంలో విమానం కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి అందులోని వారు సజీవ దహనం అయ్యారు. మృతుల్లో ఇద్దరు మిలిటరీ ఆఫీసర్లతో కలుపుకొని మొత్తం 14 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. విమానంలో సాంకేతిక లోపం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

